క్లుప్తంగా

కులగణన బాధ్యతగా చేయాలి



నరసరావుపేట: ప్రతిఒక్కరూ పాల్గొని కులగణన సర్వే బాధ్యతగా నిర్వర్తించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ ఆదేశించారు. గురువారం పట్టణంలోని 20 నుంచి 33 వార్డులకు చెందిన సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కులగణనపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దీనిలో ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దన్నారు. వారం రోజుల వ్యవధిలో పూర్తిచేయాలని కోరారు.

కులగణన విజయవంతం చేయాలి

శావల్యాపురం: కులగణన కార్యక్రమం ప్రజల సహకారంతో విజయవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య కోరారు. గురువారం మండలంలోని కారుమంచి గ్రామసచివాలయంలో కుల గణన కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ కుల గణన ప్రక్రియ ఈనెల 27 నుంచి అన్నీ గ్రామాల్లో ప్రారంభం అవుతుందని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటి సర్వే చేసి వలంటీర్లు మొబైల్ యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమం డిసెంబరు 3లోగా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సర్వే ప్రక్రియలో సమగ్ర వివరాలను పొందుపరచాలన్నారు. వలంటీర్లు అందరు కుల గణన ప్రక్రియను నూరుశాతం నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చింతా శ్రీనివాసరావు శ్రీవల్లి, వేల్ఫేర్ అసిస్టెంట్ శిరీసుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో వర్షం

రొంపిచర్ల: అల్పపీడన ప్రభావంతో మండలంలో బుధవారం రాత్రి నుంచి అడపాదడపా వర్షం కురుస్తోంది. గురువారం ఉదయానికి 25.2 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఆకాశం మేఘావృతమై చల్లటి వాతావరణంతో వర్షపు జల్లులు పడుతున్నాయి. ఈ వర్షం రైతాంగానికి మంచి ఊరటనిచ్చింది.

అగ్నిప్రమాదాల నివారణలో అప్రమత్తంగా ఉండాలి

ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ ఎంవీ సుబ్బారావు



నరసరావుపేట: అడవుల్లో జరిగే అగ్నిప్రమాదాలను నివారించటంలో అటవీశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నరసరావుపేట ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ఎంవీ సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం కోటప్పకొండలో అటవీశాఖ, అగ్నిమాపక శాఖ అధ్వర్యంలో అడవిలో జరిగే అగ్ని ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి అటవీశాఖ సిబ్బందికి అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కలిగించారు. అడవుల్లో ఏవిధంగా అగ్ని ఏర్పడుతుంది, అది పుట్టగానే ఏవిధంగా వ్యాపించకుండా నిలువరించాలో తెలియచెప్పారు. ఫారెస్ట్‌లో చేయవలసిన, చేయకూడని పనులు గురించి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.రామచంద్రరావు, వినుకొండ రేంజ్ అటవీ క్షేత్ర అధికారి సయ్యద్ హుస్సేన్, అటవీశాఖ సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం



చిలకలూరిపేట: పట్టణంలోని శారదా జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఐ.ఉమా ప్రమాదంలో గాయపడి ఓ ప్రైవేటు వైద్య శాలలో చికిత్స పొందుతోంది. ఈ విద్యార్థినిని ఆసుపత్రిలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం పరామర్శించి ఆమె తల్లిదండ్రులకు రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వైద్యులను విద్యార్థి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ తోట బ్రహ్మస్వాములు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల సమీపంలోని అద్దంకి–నార్కెట్‌పల్లి రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి నెల్లూరు వెళ్తున్న కారు ఈపూరు మండలం ముప్పాళ్ళ నుంచి నరసరావుపేటకు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న డ్రైవర్ గంగబోయిన రమేష్, కోలా నాగేశ్వరరావు, మంచాల ఏసమ్మలకు గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని మరో వాహనంలో నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాలు చారిత్రకం – జగనన్న పాలన చరిత్రాత్మకం

- కొండవీడులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో –వైఎస్సార్‌సీపీ నేతలు
- వేర్వేరు ప్రాంతాల్లో ఉత్సాహంగా పాల్గొన్న అభిమానులు, కార్యకర్తలు
- ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరించే బోర్డుల ఆవిష్కరణ

యడ్లపాడు: ప్రజాసేవే... ప్రభుత్వ బాధ్యత అని చిత్తశుద్ధితో పారదర్శక పాలన సాగిస్తున్న జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఘంటా శంకర్ చెప్పారు. మండలంలోని కొండవీడులో పార్టీ నాయకులు షేక్ జాకీర్ ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం గురువారం జరిగింది. ముందుగా ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు సచివాలయంలో సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించి, వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన మా నమ్మకం నువ్వే జగన్ సభకు శంకర్‌తో పాటు జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు, సొసైటీ చైర్మన్ బసెల శివరామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. కొండవీడు కోట అభివృద్ధికి మహానేత వైఎస్సార్ శ్రీకారం చుట్టగా, జననేత జగన్ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన నాటి నుంచి తండ్రి ఆశయాలను సాకారం చేసేందుకు కొండవీడును గొప్ప పర్యాటకంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చొరవతో నగరవనం పేరిట చెక్‌పోస్టు, స్వాగత ద్వారం, రెండోదశ ఘాట్ రోడ్డు, చిల్డ్రన్స్ పార్కు, ఔషధ వనాలు, పగోడాలు, పచ్చదనం, డెక్, వ్యూపాయింట్లు, సాహస క్రీడలు, తాగునీటి, మరుగుదొడ్లు, వాటర్‌ట్యాంక్ ఏర్పాటు, విద్యుత్, నైట్ క్యాంపెన్ గుడారాలు వంటి వాటిని సందర్శకులకు అందుబాటులోకి తెచ్చారన్నారు. తద్వారా కొండు చుట్టూ ఉన్న గ్రామాల్లో నివసించే కుటుంబాలు ఆర్థిక ప్రగతి సాధించే వీలు కలిగిందన్నారు. స్థానికంగానూ భూముల విలువ పెరిగాయన్నారు. కుల, మత, వర్గ, పార్టీ భేదాలు చూడకుండా నేరుగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తున్న సీఎం జగన్‌ను మరోమారు ఆశీర్వదించాలని కోరారు.

కొండవీడు, కొత్తపాలెం ప్రజలకు రూ.23.05 కోట్ల లబ్ధి

చిలకలూరిపేట ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని సహకారంతో సచివాలయం పరిధిలోని కొత్తపాలెం, కొండవీడు గ్రామాల్లో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి రూ.23,05,22,443కోట్ల లబ్ధి రెండు గ్రామాల ప్రజలకు చేకూరిందన్నారు. డీబీటీ, నాన్‌డీబీటీ కలిపి మొత్తం 33 సంక్షేమ పథకాల ద్వారా రూ.20,39,22,443 కోట్లు లబ్ధిచేరగా, పలు అభివృద్ధి పనులకు సంబంధించి రూ.2,66 కోట్లు నిధులు వచ్చాయన్నారు. వీటిలో నాడు–నేడు కింద పాఠశాలలు, ఆస్పత్రులకు రూ.70 లక్షలు, గ్రామ సచివాలయ భవన భవన సముదాయాలకు రూ.1.27 కోట్లు, రోడ్ల నిమిత్తం రూ.59.30 లక్షలు, ఇతర అభివృద్ధి పనులకు రూ.10.73 లక్షలతో వివిధ పనులకు వెచ్చిస్తున్నట్లు వివరించారు. అనంతరం గ్రామంలోని ఆయా ప్రాంతాల్లో పలు ఇళ్లను సందర్శించి గత నాలుగేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన పాలనాప్రగతి, సంక్షేమ, అభివృద్ధి వివరాల కరపత్రాలు గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మొహమ్మద్ యూనీస్, ఎంపీ సుబ్బారావు, పార్టీ నాయకులు షేక్ జాకీర్ హుస్సేన్, నందిగోలు కోటయ్య, ముజావర్ బాజీ, కట్టా ప్రసాద్, ధర్నాసి చినబాబు, మానం సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి అక్కయ్య, వలంటీర్లు, సచివాలయ సారథులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొండవీడు సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ బోర్డు ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు



బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వెల్లటూరులో పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు

కొండ్రముట్లలో..

ఈపూరు: ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు మండలంలోని కొండ్రముట్ల గ్రామ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలు తెలియజేసే బోర్డును ఆవిష్కరించి వై ఏపీ నీడ్స్ జగన్ బ్రోచర్లను పంపిణీ చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలు నెరవేర్చారని, మళ్లీ ఆయనే ముఖ్యమంత్రిగా రావాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే చేరేలా చూసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు, గ్రామ పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

వెల్లటూరులో

బొల్లాపల్లి: వైఎస్సార్‌సీపీ అధికార పగ్గాలు చేపట్టి నాలుగున్నారేళ్లల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలు గురించి వివరించడమే ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తి గురవయ్య అన్నారు. మండలంలోని వెల్లటూరు సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో చేపట్టిన సంక్షేమ పథకాలు తెలిపే బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ జండాను ఆవిష్కరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలనే పుస్తకాన్ని ఆవిష్కరించి బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తి గురవయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రతి ఇంటికి సంక్షేమం చేరిందన్నారు. గత పాలనకు ప్రస్తుత పాలనకు చాలా తేడా ఉందని, గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు పక్షపాతధోరణితో ప్రస్తుతం నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు రపతి ఒక్కరికీ అందాయన్నారు. ప్రస్తుతం పరిపాలనా విధానాల గురించి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే ప్రధానంగా సంక్షేమం వర్ధిల్లిందని, 90 శాతం సంక్షేమ పథకాలు అమలయ్యాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన ఆవశ్యకత ఉందని, ఈ సచివాలయం పరిధిలో రూ. 33.87 కోట్ల మేర సంక్షేమాభివృద్ధి జరిగిందని, 1926 మంది లబ్ధి పొందారని, ప్రతి ఒక్కరూ గమనించాల్సి ఉందని, ఈ ప్రభుత్వం పనితీరును గుర్తించి మరోసారి ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఎం. చిన్నవీరయ్య, ఆర్. కృష్ణానాయక్, డి. గోవిందునాయక్, టి. కోటిరెడ్డి, జి. చిన్నవెంకయ్య, ఎం.రాజయ్య, కె.లక్ష్మీనారాయణ, పి. అవినాష్ రెడ్డి, టి.గురున్నాథం, అధికారులు జి.శ్రీహరి, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాల షెడ్యూల్

శావల్యాపురం: ఆంధ్రప్రదేశ్ జగన్ ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమంలో భాగంగా మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రభుత్వం షెడ్యూలు ప్రకటించినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య గురువారం తెలిపారు. శుక్రవారం గుంటుపాలెం, 28న కనమర్లపూడి, ఈనెల29న కారుమంచి, 30న కొత్తలూరు, 01న మతుకుమల్లి, 04న పిచికలపాలెం, 05న పోట్లూరు, 06న శానంపూడి, 07న శావల్యాపురం, 08న వేల్పూరు–1, 11న వేల్పూరు–2 గ్రామ సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలు లబ్ధిదారుల సమగ్ర వివరాలతో కూడిన డిస్ప్లే బోర్డు ద్వారా ప్రచురణ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అధికారుల అందరూ సమన్వయంతో జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మంచి పాలకుడికి మరోదఫా పట్టంకట్టాలి

నాదెండ్ల: మంచిపాలన అందించే పాలకుడికి ప్రజలు ఎప్పుడూ అండగా ఉండాలని, అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరో దఫా ప్రజ ఆశీర్వదించాలని ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. చిరుమామిళ్ళ గ్రామ సచివాలయంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.18,45,52,700లు నిధులు ఖర్చు చేసినట్లు పైలాన్ ఆవిష్కరించారు. ముందుగా గ్రామ పార్టీ నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. సచివాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అక్కడే ఉన్న మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే దొడ్డా బాలకోటిరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాలుగున్నరేళ్ల పాలనలో ఇచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చి ప్రజల మన్ననలు పొందారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి నెలా 1వ తేదీనే తలుపుతట్టి పింఛను అందిస్తున్నారన్నారు. విత్తన కొనుగోలు నుంచి పంట ఉత్పత్తులు అమ్మే వరకూ ఆర్‌బీకేల ద్వారా రైతన్నలకు విశిష్టమైన సేవలు అందిస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పేదవారికి కూడా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారన్నారు. నాడు నేడు ద్వారా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చారని, కార్పొరేట్ స్థాయిని తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోందన్నారు. ప్రతి పేదవాడికి నివేశన స్థలంతో పాటూ ఇంటి నిర్మాణం చేసి వారి సొంతింటి కలసాకారం చేస్తున్నామన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేసేందుకు రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చారన్నారు. మహిళలకు మునుపెన్నడూ లేని విధంగా అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించారన్నారు. సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, వైసీపీ మండల అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, నాదెండ్ల, గణపవరం సొసైటీల అధ్యక్షులు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, ఎంపీటీసీ యామర్తి సునీత, జగనన్న సురక్ష మండల కన్వీనర్ అల్లడి రవికుమార్, ఉపసర్పంచ్ మేకల హనుమాయమ్మ, ఎంపీటీసీ యామర్తి సునీత, నాదెండ్ల, గణపవరం సొసైటీల అధ్యక్షులు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, సచివాలయ కన్వీనర్లు మేకల శ్రీనివాసరెడ్డి, మార్త సాంబశివరావు, యామర్తి శిరీష, వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు జోజిబాబు, పార్టీ నాయకులు గుర్రం ఉపేంద్ర, గద్దె కోటయ్య, ఆంజనేయులు, సింగారెడ్డి కోటిరెడ్డి, టీజీ రత్తయ్య, పత్తి వెంకట్, పంచాయతీ కార్యదర్శి స్వాతి ఉన్నారు.



చిరుమామిళ్ళలో బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు

ప్రజా శ్రేయస్సే పరమావధిగా జగనన్న పాలన

చిలకలూరిపేట: ప్రజా శ్రేయస్సే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు చెప్పారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని పట్టణంలోని 13,14 వార్డులు, మండలంలోని యడవల్లి, కట్టుబడివారిపాలెం గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయంటే అది పూర్తిగా సీఎం వైఎస్ జగన్ ఆలోచనా విధానానికి నిదర్శనమని కొనియాడారు. కులం, మతం, వర్గం, పార్టీ అనే వైషమ్యాలు లేకుండా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చటమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఈ విషయం క్షేత్రస్థాయిలో ఎవరు పరిశీలించినా అర్థమౌతుందని పేర్కొన్నారు. జగనన్న పాలనలో పేదల ఆర్థిక పరిస్థితులు ఎంతో మెరుగుపడ్డాయని అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయని చెప్పారు. ఇలాంటి పరిపాలన కొనసాగడం మన అదృష్టంగా భావించాలని తెలిపారు. పట్టణంలోని 13, 14 వార్డులో రూ.33.98 కోట్లు ,మండలంలోని యడవల్లి, కట్టుబడివారిపాలెం గ్రామ సచివాలయ పరిధిలో రూ.25.46 కోట్లు లబ్ధి చేకూరిందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షులు క్లస్టర్ –1 పఠాన్ తలహాఖాన్, క్లస్టర్ –2 విడదల కమలేంద్ర, 13, 14 వార్డు కౌన్సిలర్లు షేక్ మీరాబి, షేక్ జమీలా, ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా యాములయ్య తదితరులు పాల్గొన్నారు.

గణపవరంలో కోటినామ ముగింపు హోమం

నాదెండ్ల: గణపవరంలో నూతనంగా నిర్మించి కోదండ రామాలయంలో ఈ నెల 14 నుంచి కార్తికమాసం లలిత సహస్ర నామ పారాయణం ముగింపు సందర్భంగా గురువారం యాగశాలలో హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దర్శి ఉమామహేశ్వర్, అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గణపవరం లలితా పారాయణ బృందం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కెల్లంపల్లి సుందరరావు, వలేటి వెంకటేశ్వరరావు, కెల్లంపల్లి అచ్చయ్య పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన ఏర్పరచుకోండి

నాదెండ్ల: వినియోగదారుల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం ఆఫ్ ఇండియా జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మురికిపూడి ప్రసాద్ చెప్పారు. ఫోరం ఆధ్వర్యంలో గణపవరం కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం కృష్ణానాయక్‌తో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. పౌర సరఫరాల శాఖా ఆధ్వర్యంలో నవంబర్ 22 నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకూ అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్, స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు కొనుగోలు చేస్తున్న ప్రతి వస్తువుకు దుకాణ యజమానుల నుంచి బిల్లులు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన వస్తువుపై నిర్దేశించిన నాణ్యత ప్రమాణాల్లో లోపాలు ఉన్నట్లయితే నష్టపరిహారం కోసం కోర్టులను ఆశ్రయించి పరిహారం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవినాయక్, విక్రం, పీఈటీ శ్రీకాంత్, పీడీ వేణుగోపాల్, అనంత శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గణపవరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫోరం నాయకులు, ఉపాధ్యాయులు

ఆటో అదుపుతప్పి వ్యక్తిమృతి

ఈపూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వనికుంట గ్రామంవద్ద గురువారం రాత్రి జరిగింది. కొచ్చెర్ల గ్రామానికి చెందిన నాదిమీడు ఏడుకొండలు (45) ఆటోలో కూరగాయలు అమ్ముకునే వ్యాపారి. వివిధ గ్రామాల్లో కూరగాయలు అమ్ముకుని తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో అంగలూరు సమీపంలో ఆటో అదుపుతప్పి రోడ్డు ప్రక్కన ఉన్న పొలాల్లో పడిపోయింది. ఈప్రమాదంలో ఏడుకొండలు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇరువురు సంతానం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు ఏడుకొండలు

అర్హులైన వారికి సంక్షేమ పథకాలు

వినుకొండ(నూజెండ్ల): గ్రామాల్లో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కార దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని నూజెండ్ల ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన నూజెండ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ సచివాలయ సిబ్బందితో పాటు అధికారులు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పారిశుద్ధ్య మెరుగుకు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కరెంటు సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరభద్రాచారి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, సొసైటీ అధ్యక్షులు పొట్లపల్లి పిచ్చిరెడ్డి, పారా వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్‌డీ రవికుమార్‌తో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

చిలకలూరిపేట: వచ్చే ఎన్నికల్లో కేంద్రంలోని ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించే లక్ష్యంలో భాగంగా ఈ నెల 27,28 తేదీలలో విజయవాడలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని వామపక్ష ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ కార్మిక సంఘాల ఐక్యవేదిక, ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించే మహాధర్నా కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కులు కాలరాస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని విమర్శించారు. వ్యవసాయ నల్లచట్టాల రద్దు కోసం రైతులు ఉద్యమించి ప్రధాని దిగి వచ్చేలా చేసిన రీతిలో ప్రజా ఉద్యమాలు సాగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ, సీఐటీయు డివిజన్ కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు, ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో గిరిప్రదక్షిణ నగరవనం ఏర్పాటు

జిల్లా అటవీ అధికారి ఎస్.రామచంద్రరావు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ గిరిప్రదక్షిణ నగరవనాన్ని రూ.2 కోట్లతో ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా అటవీ అధికారి ఎస్.రామచంద్రరావు తెలిపారు. కోటప్పకొండ గిరిప్రదక్షిణ మార్గాన్ని గురువారం ఆయన సందర్శించారు. నగరవనం అభివృద్ధి భాగంలో చేపటనున్న పనులపై సిబ్బందితో చర్చించి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ కోటప్పకొండ గిరిప్రదక్షిణ నగరవనాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా నగరవనం అభివృద్ధికి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేస్తారని తెలిపారు. మొదటి విడతగా అటవీశాఖ రూ.1.4 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ప్రధానంగా తోటల పెంపకం, నేల, తేమ సంరక్షణ పనులు, ఫెన్సింగ్, నిర్వహణ వ్యయం, పంచతత్వ నడక, ప్రకృతి నడక, వినాయకవనం నడక, మారేడు వనం నడక, రుద్రాక్ష వనం నడక, ఉసిరి వనం నడక, చందనవనం నడక, ఔషధ మొక్కల నడక తదితర వనాలతో గిరి ప్రదక్షిణనడక మార్గాన్ని 4.1 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేస్తామని తెలిపారు. నడక దారి వెంట సమాచార బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇంకుడు గుంతలు తవ్వి లోట స్పాండ్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. సందర్శకుల కోసం తాగునీటి కియోస్కులు, వాష్ రూమ్‌లు, బెంచీలు ఏర్పాటు చేస్తామన్నారు. గిరిప్రదక్షిణ నగరవనం ప్రాంత రక్షణ కోసం ఎంట్రీ, ఎగ్జిట్ అర్చ్‌లు, చైన్ లింక్ ఫెన్సింగ్‌లు చేపడతామని తెలిపారు. వినుకొండ రెంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ సయ్యద్ హుస్సెన్, నరసరావుపేట రెంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ రమణమ్మ, సెక్షన్ ఆఫీసర్ సీతారామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



కోటప్పకొండ గిరిప్రదక్షిణ మార్గాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్ఓ రామచంద్రరావు

మిరప పంటల పరిశీలన

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని పమిడిపాడు గ్రామంలోని మిరప పంట పొలాలను వినుకొండ ఉద్యాన అధికారి షేక్ నబీ రసూల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్ల తామర పురుగు నివారణకు ఎకరాలకు 200 కేజీల వేపపండి భూమిలో వేయాలన్నారు. దీని వలన తామరపురుగు కోశస్థ దశలను నియంత్రించవచ్చని తెలిపారు. అంతేకాకుండా పురుగుమందులు పిచికారీ చేసేటప్పుడు వాటితో పాటు 10వేల పీపీఎం వేపనూనెను ఒక లీటరుకు రెండు మిల్లీలీటర్ల చొప్పున కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. నత్రజని ఎరువులు అధికమోతాదులో వాడకూడదన్నారు. సూక్ష్మపోషకాల లోపం ఉన్నట్లయితే ఫార్ములా –4 ఐదు గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేయాలన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



బొల్లాపల్లి: అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటామని వైఎస్సార్ సీపీ యువనాయకులు బొల్లా గిరిబాబు అన్నారు. ఇటీవల మండలంలోని సరికొండపాలెం గ్రామ ఎస్సీ కాలనీలోని ప్రార్థనామందిరం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంబంధించి దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో నష్టపోయిన ప్రార్థనామందిరం బాధిత కుటుంబాలను గురువారం యువనాయకులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఒంగోలు సుబ్బారావు, డి.గోవిందునాయక్, ఎం. రాజయ్య, అవినాష్‌రెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట రూరల్ ఎస్ఐగా కె.రోశయ్య

నరసరావుపేట రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా కె.రోశయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. నల్లపాడు ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో నరసరావుపేట రూరల్ ఎస్ఐగా రోశయ్య పనిచేశారు. ఇప్పటి వరకు ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన ఎస్ఐ బాలనాగిరెడ్డి డీఎస్‌బీకి బదిలీ అయ్యారు. మండలంలో శాంతిభద్రతల రక్షణే ధ్యేయంగా పనిచేస్తానని రోశయ్య తెలిపారు.